Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143


WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

8 Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 183 | Saturday : 29.06.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :183 | శనివారం 29 జూన్ 2025 | వెల : 3 | పేజీలు : 4

# కాంగ్రెస్‌లో వర్గపోరు?

- తలనొప్పిగా మారుతున్న గొడవలు
- అన్ని పార్టీలు స్థానిక సంస్థలకు సమాయత్తమవుతున్నాయి
- అయితే అధికార పార్టీలో మాత్రం ఈ ఎన్నికలు గుబులు పుట్టిస్తున్నాయి
- తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరారు
- ఆ నియోజకవర్గాల్లో ఇప్పుడు వర్గపోరు నడుస్తోంది.
- ఈ దిశగా వచ్చే పంచాయతీ ఎన్నికల్లో తమ వ్యూహాలు, తమ బలంతో ఎక్కువ పంచాయతీలు గెల్చుకుని సత్తా చాటాలాని చూస్తున్నారు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

పంచాయతీ ఎన్నికలు సెప్టెంబర్ 30వ తేదీలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అన్ని పార్టీలు స్థానిక సంస్థలకు సమాయత్తమవుతున్నాయి. అయితే అధికార పార్టీలో మాత్రం ఈ ఎన్నికలు గుబులు పుట్టిస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరారు. ఆ నియోజకవర్గాల్లో ఇప్పుడు వర్గపోరు నడుస్తోంది. తామే ఒరిజనల్ కాంగ్రెస్ అని, వచ్చిన వారు వలస కాంగ్రెస్ నేతలు అన్న బేధాప్రాయాన్ని పాత కాంగ్రెస్ నేతలు తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పట్టు నిలుపుకోవడానికి అటు వలస నేతలు, ఇటు ఒరిజినల్ నేతలు ఇప్పటి నుంచే పార్టీ పెద్దలపై తమ వారికే అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలా రెండు వర్గాల నుంచి వస్తోన్న డిమాండ్లతో హస్తం పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. ఈ గొడవలు ఇలానే ముదిరితే పంచాయతీ ఎన్నికల్లో గెలుపుపై ప్రభావం చూపుతాయని ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఈ వర్గ పోరులో ఉన్నసమస్య ఏంటంటే పార్టీలోకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో తమ బలం చూపించడం ద్వారా హైకమాండ్ మనసు గెల్చుకోవడం,తద్వారా తమ రాజకీయ భవిష్యతుకు మరిన్ని పెద్ద అవకాశాలు సృష్టించుకోవచ్చని ఆలోచిస్తున్నారు. ఈ దిశగా వచ్చే పంచాయతీ ఎన్నికల్లో తమ వ్యూహాలు, తమ బలంతో ఎక్కువ పంచాయతీలు గెల్చుకుని సత్తా చాటాలాని చూస్తున్నారు. ఇక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేతిలో దురదృష్టవశాత్తు శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయినా, తమ ప్రభుత్వం అధికారంలో ఉందన్న ఆనందంలో ఓడిపోయిన అభ్యర్థులు ఉన్నారు. ఆ ఆనందానికి గండి కొడతూ, తమపైన గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో పాత నేతలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఈ చేరికలు తమ రాజకీయ భవిష్యత్తును సమాధి చేస్తుందన్న ఆందోళనలో ఉన్నారు. వలస నేతలు వచ్చి - మిగతా3లో



## ఐఎస్ఎస్ నుంచి శుభాంశు వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ

- శుభాంశు శుక్లాకు ప్రధాని మోదీ ఌశుభాకాంక్షలు
- అక్కడ మిషన్ విజయవంతం కావాలి
- భవిష్యత్‌లో శుభాంశు శుక్లా మరిన్ని విజయాలు సాధించాలి



## రా చీఫ్‌గా పరాగ్ జైన్

- ప్రస్తుత 'రా' చీఫ్ రవి సిన్హా పదవీకాలం జూన్ 30వ తేదీతో ముగియనుంది.
- జూలై 1న పరాగ్ జైన్ కొత్త చీఫ్‌గా బాధ్యతలు చేపడతారు
- పస్తుతం ఆయన ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్ అధిపతిగా సేవలందిస్తున్నారు.

## దేశంలోనే తొలి డిజిటల్ హైవే

- నిబంధనలు ఉల్లంఘిస్తే క్షణాల్లో చలాన్!
- మున్ముందు ఇవి స్మార్ట్‌రూపు సంతరించుకోబోతున్నాయి

# ఆగస్ట్ 15వ తేదీ నుంచే మహిళలకు ఉచిత బస్సు

- మరో పథకానికి డేట్ ఫిక్స్..
- ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన
- మహిళలకు ఉచిత బస్సు పథకంపై సంబంధిత అధికారులతో చర్చ
- ఈ పథకం అమలు చేయడంలో ఇబ్బందులు తలెత్తకుండా ఆక్యుపెన్సీకి తగ్గట్లుగా బస్సులు నడిపించాలి
- తమ ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15వ తేదీ నుంచే ఈ పథకం అమలు చేయాలి
- ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ, ఏసీ బస్సులే ఉండాలి





**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళా శక్తి పేరిట ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం హామీపై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం ఉండవల్లిలోని తన నివాసంలో మహిళలకు ఉచిత బస్సు పథకంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. ఈ పథకం అమలు చేయడంలో ఇబ్బందులు తలెత్తకుండా ఆక్యుపెన్సీకి తగ్గట్లుగా బస్సులు నడిపించాలని సూచించారు. తమ ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15వ తేదీ నుంచే ఈ పథకం అమలు చేయాలని తెలిపారు. - మిగతా3లో





## 'పెట్టుబడులు తెచ్చిందేమో జగన్.. ప్రచారమేమో చంద్రబాబుది

- చంద్రబాబు నాయుడు చెప్పే పెట్టుబడులన్నీ కట్టుకథలే
- కోటి ఉద్యోగాలు అంటూ 1999లో చెప్పి కనీసం లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు
- 2014లో కూడా 25 లక్షల ఉద్యోగాలు, పది లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తానని కథలు వినిపించారు
- 2024లో కూడా 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అంటూ మళ్ళీ మోసం చేశారు
- ఎన్టీపీసీ లక్షా పదివేల కోట్ల విలువైన ఎంఓయూని జగన్ ప్రభుత్వంలో చేసుకుంది
- అన్ని అనుమతులు, భూకేటాయింపులన్నీ జగనే చేశారు.

# హలో నిరుద్యోగి.. ఛలో సెక్రటేరియట్!

- ఛలో సెక్రటేరియల్ పోస్టర్‌ను హరీష్ రావు విడుదల
- బీఆర్ఎస్ హయంలో 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే దక్కేలా కేసీఆర్ చొరవ తీసుకున్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న జాబ్ క్యాలెండర్ లో ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయడం లేదని నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారు.



Cell: 9440552050 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని సందర్శించిన కర్ణాటకరాష్ట్ర న్యాయశాఖా మత్యులు హెచ్. కె. పాటిల్





**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 28:** కుప్పంనియోజకవర్గ గుడిపల్లి మండలంలో కర్ణాటక రాష్ట్ర న్యాయశాఖామత్యులు హెచ్. కె. పాటిల్ వారి సిబ్బందితో ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని శనివారం రోజు మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా వారు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య యం.దొరస్వామి, కులసచివులుఆచార్య కిరణ్ కుమార్, ఆచార్య యం.ఎన్. వెంకటేష్, ఆచార్య కె.శారద, ఆచార్య జయలలిత, ఆచార్య బి.శివకుమార్, ఆచార్య శ్రవణకుమార్,డాక్టర్.దుర్గాప్రవీణ్, డాక్టర్ మల్లేషప్ప, ఆచార్య శ్రీనివాస్ కుమార్ విశ్వవిద్యాలయ పురోగతి భాషాభివృద్ధి, కన్నడ భాష సేవలు, తదితర విద్యావిషయక వికాసాన్ని గూర్చి మంత్రితో ఇష్టాగోష్టి చర్చజరిరు. ద్రావిడభాషల అభివృద్ధి కొరకు, ప్రత్యేకంగా కన్నడభాష నుండి ఇతర ద్రావిడ భాషలకు ప్రాచీన సాహిత్యాన్ని, సామాజిక, రాజకీయశాస్త్ర, న్యాయ శాస్త్రాలకు సంబంధించి పదకో శాలను తయారు చేయడానికి అందుమూలముగా కలిగే ప్రయోజనాలను మంత్రికి వివరించారు. కర్ణాటక ప్రభుత్వానికి ఈ అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను పంపవల సినదిగా మంత్రి ఉపాధ్యక్షుల వారిని కోరినారు. ఈ సందర్భంగా వారికి తేనిటి విందును విశ్వవిద్యాలయం వారు ఏర్పాటు చేశారు. ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని సందర్శించటం తనకు ఎంతో సంతోషంగా ఉందని, విశ్వవిద్యాలయం వారి ప్రతిపాదనలను తాము ప్రభుత్వం తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటుందని మంత్రి తెలియజేశారు.

## భూమి పూజతో ప్రారంభమైన రోడ్డు పనులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 28:** కుప్పంపట్టణంలోని కొత్తపేట నేతాజీ రోడ్డు వద్ద శనివారం స్థానిక టిడిపి నాయకులు రోడ్డు పనులను భూమి పూజలు ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ భూమి పూజతో పనులను ప్రారం భించిన కార్యక్రమానికి పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పట్టణ అభివృద్ధిలో భాగంగా నేతాజీ రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబుల సహకారంతో పట్టణాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఇన్చార్జి ముఖేష్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్, స్థానిక టిడిపి నాయకులు అన్సర్ భాష, మునెప్ప,వేణు,ఆర్ముగం,దిలీప్, తిరుమగల్ తదితరులు పాల్గొన్నారు.

## చౌడేపల్లి సింగిల్ విండో అధ్యక్షుడిగా హరి రాయల్



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 28:** చౌడేపల్లి సింగిల్ విండో అధ్యక్షుడిగా చిట్టిరెడ్డిపల్లికి చెందిన పగడాల హరి రాయల్ నియమి తులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం త్రీమ్యాన్ కమిటీని ఎంపిక చేసింది, పగడాల రాయలతో పాటు పాపి శెట్టి పల్లి సుబ్రహ్మణ్యంరాజు వెంగళపల్లి మాజీ సర్పంచ్ వెంకటరమణలతోకూడిన త్రీమాన్ కమిటీని నియమించింది. ఇందులో భాగంగా పగడాలహరి రాయల్‌ను అధ్యక్షునిగా ఎంపికచేశారు.తనపై ఇంతటి బాధ్యతను అప్పగించిన తెలుగుదేశంపార్టీ అధిష్టానానికి ముఖ్యంగా పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డికి రుణపడి ఉంటానని రైతు సమస్యల పట్ల స్పందిస్తానని ఈ సందర్భంగా పగడాల హరి రాయల్ అన్నారు.

## ధూమ్ర వైష్ణవిదేవిగా అవతారం ఎత్తిన అమ్మవారు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 28:** స్వయంభు శ్రీవైష్ణవిదేవి ఆలయం పుది పట్లలో వారాహిదేవి నవరాత్రులలో మూడవరోజు శ్రీధూమ్ర వైష్ణవిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయాన్నే ఆలయ అర్చకురాలు శ్రావణి పంచామృత అభిషేకాలు చేశారు. పుంగనూరు చౌడేపల్లి కర్ణాటకచుట్టుపక్కల గ్రామప్రజలందరూ అమ్మవారిని దర్శనం చేసుకుని ఎంతో ఆనందంగా అమ్మవారికి సామూహిక సౌందర్యలహర పారాయణం చేశారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించుకున్నారు. ఆలయ ధర్మకర్త వినోద్‌కుమార్ తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఉభయదారులుగా తాడేపల్లికి చెందిన బాలకృష్ణ ధర్మపత్నిరాధ గారు వ్యవహరించారు.

## దాదేపల్లి ఉరుసు కార్యక్రమంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి





**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 28:** చౌడేపల్లి మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ దాదేపల్లిలో జరిగిన ముస్లింమైనార్టీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన, ఉర్సు కార్యక్రమంలో మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. శనివారం దాదేపల్లిలోని దర్గాలో గంధం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైకాపా ఉపాధ్యక్షుడు మండల జడ్పిటిసి నడింపల్లి దామోదర్ రాజు, రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్, ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ ,చంగారెడ్డి ,అమర్నాథ్, దాదేపల్లి ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## స్కూటర్ను ఢీకొన్న కారు ఇద్దరికీ గాయాలు

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 28:**



స్కూటర్ను కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన శనివారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది బాధితుల కథ మేరకు... చౌడేపల్లి పలమనేరు ప్రధాన రహదారిలో చౌడేపల్లి వైపు వస్తున్న స్కూటర్ను పలమనేరు వైపు వెళ్తున్న కారు ఓదులపేట స్టేజి వద్ద ఢీకొన్నది ఈ ప్రమాదంలో సుమిత్ర 35 కృష్ణ మూర్తి 40లకు గాయాలయ్యాయి గాయపడ్డ వీరిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ సుమిత్ర ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 108 సేవల ద్వారా మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## మండల వైద్యాధికారిణిగా మోనా



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 28:** చౌడేపల్లి మండల వైద్యాధికారినిగా మన నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న పవన్ కుమార్ పుంగునూరుమండలం ముడిపాపనపల్లి ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయ్యారు. పుట్టపర్తి జిల్లా అమ్మడు ఆరోగ్య కేంద్రం నుంచి మోనా ఇక్కడికి నియమితులయ్యారు. రోగులకు అందు బాటులో ఉంది, సేవలందిస్తానని ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మోనా విలేకరుల సమావేశంలో తెలిపారు.

## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే థామస్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కూటమినాయకులు



**వెదురు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 28:** గంగాధర్ నెల్లూరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్న నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గురసాల కిషన్ చంద్, నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు బట్టే చాణిక్య ప్రతాప్, ఇనాం కొత్తూరు టిడిపి సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, యువ నాయకులు మురళి రెడ్డి, జక్కదోనా బూత్ కన్వీనర్ లోకేష్ యాదవ్ మరియు బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి. పాల్గొన్నారు.

## సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలకు స్వాగతం పలికిన స్థానిక సర్పంచ్ బండి శశి ఆనంద రెడ్డి



**వెదురు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 28:** అయోధ్య నుంచి వచ్చిన సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలకు స్వాగతం పలికిన స్థానిక సర్పంచ్ బండి శశి ఆనంద రెడ్డి మాజీ సర్పంచ్ బోడి రెడ్డి హనుమంత రెడ్డి, గ్రామ ప్రజలు యువకులు అందరూ పాల్గొని ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేసి ఆర్తి ఇచ్చి తీర్థ ప్రసాదాలు తీసుకోవడం జరిగింది. భక్తులందరూ కూడా భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది, వచ్చినవారు శ్రీరాముడు యొక్క విశిష్టతలు భక్తులకు తెలియజేసిది వివరించడం జరిగినది. గ్రామంలో అందరూ కూడా అయోధ్య దైవ దర్శనం మాకు లభించిందని ఆనందించారు.

## నర్సింగ్ కళాశాలలో ఘనంగా జ్యోతి ప్రజ్వలన దినోత్సవం

**కుప్పం,ఎచిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 28:**




కుప్పం నర్సింగ్ కళాశాలలో ఘనంగా జ్యోతి ప్రజ్వలన దినోత్సవం నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ ప్రియ నర్సింగ్ హోమ్ డాక్టర్ సుధీర్, బిసిఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజ్, వైస్ చైర్మన్‌రాజు, సెక్రటరీసాగర్ రాజు తదితరులు పాల్గొని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. వృత్తిలో మెలకువలను పాటించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. సేవా భావంతో మెలగాలన్నారు. డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యఎంతో ఉన్నతమైనదని విద్యార్థులు మరింత సేవా దృక్పథంతో మెలగాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ జె విమలనర్సింగ్ విద్యార్థులచే ప్రతిజ్ఞచేయించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు నర్సింగ్ కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 28:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయి మెంట్ ఎక్స్చేంజ్, సీడాప్(SEEDAP), డి.ఆర్.డి.ఎ సంయుక్తంగా జూలై నెల 4వ తేదినశుక్రవారం స్థానికపలమనేరు SVCR ప్రభుత్వడిగ్రీ కళాశాలలో జరగనున్నమెగా జాబ్ మేళానునిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ జాబ్ మేళాలో 20 ప్రముఖకంపెనీలు పాల్గొంటాయన్నారు. పదోవ తరగతి, ఇంటర్, ITI&□ç^, BTech, Bpharma, DPharma విద్యార్హత కలిగిన వారు తప్పక పాల్గొనాలని కోరారు. 18 సం" నుండి 35 సం" మధ్య వయస్సు కలిగిన స్త్రీ మరియు పురుష అభ్యర్థులై ఉండాలన్నారు. ఈ జాబ్‌మేళాలో అర్హతలను బట్టి మంచివేతనం అందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలు కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు (8465830771),(9963561755). సం ప్రదించవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డిసిజిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు చైతన్య లోకేష్, సిసింద్రీలతో పాటు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## సాఫ్ట్వేర్ బాలును అభినందించిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్




**ఎస్ ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 28:** గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మదిన సందర్భంగా ఎస్ఆర్ పురం మండలం పిల్లారి కుప్పం క్రాస్ రోడ్లో సాఫ్ట్వేర్ బాలు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మదిన సందర్భంగా భారీ కేక్ ఏర్పాటు చేయడంతో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు అలాగే ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే బర్త్డే స్పెషల్ సాంగ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సమక్షంలో ఆవిష్కరించరు,బర్త్డే స్పెషల్ సాంగ్ చాలా బాగుంది అని సాఫ్ట్వేర్ బాలును ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జై చంద్రబాబు నాయుడు మాజీ సర్పంచ్ భాస్కర్ నాయుడు రాష్ట్ర టిడిపి యువత నాయకుడు శివ,గల్లా,టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాపై అభిమానం చూపిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటా ఎమ్మెల్యే డాక్టర్ థామస్



**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 28:** నా పుట్టినరోజున వేలాది మంది తరలి వచ్చి అభి మానం చూపిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పుట్టినరోజు సందర్భంగా గంగాధర్ నెల్లూరు మండలం రామానాయుడు పల్లి వద్ద ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే సుమారు పది క్రేన్లతో గజమాలతో సన్మానించారు అలాగే జెసిబిల ద్వారా పూల వర్షంతో ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు ఘనస్వాగతం పలికారు బారి కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహిం చారు, అనంతరం 6000 మందికి దుస్తులు పంపిణీ చేశారు అలాగే వికలాంగులకు 6 ఎలక్ట్రిక్ సైకిల్‌ను పంపిణీ చేశారు పేదలకు 6 ఎలక్ట్రిక్ స్కూటర్లను పంపిణీ చేశారు. అలాగే ఎస్ఆర్ పురం అటవీ ప్రాంతంలో వల్లెమ్మ కు కుడు గూడు లేని నిరుపేద ఆమె మనవళ్ళు నలుగురు పిల్లలను చదువు కొరకు లక్ష రూపాయలు చెక్కును అందించారు, అలాగే వారికి ఇల్లు కట్టిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి శాంతి రెడ్డి ఎమ్మెల్యే తనయులు డాక్టర్ రాహుల్, రోషన్,చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సిఆర్ రాజన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ చంద్రగిరి ఎమ్మెల్యే తనయుడు వినిల్, మేయర్ అమ్ముదా డిప్యూటీ మేయర్ రాజేష్ రెడ్డి వసంత్ కుమార్ మాజీ ఎమ్మెల్సీ దొరబాబు బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేంద్రన్, సాఫ్ట్వేర్ బాలు, తాళ్లూరి శివ, ఎస్ఆర్ పురం మండల అధ్యక్షుడు జయ శంకర్ నాయుడు రుద్రప్ప నాయుడు రాజశేఖర్ నాయుడు భాస్కర్ నాయుడు, పైనేని మురళి ,నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్ ఆర్టిఐ జిల్లా అధ్యక్షుడు జయరాజ్ ఐటీడీపీ యువ నాయకుడు దశరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నగర వాసులకు శుభవార్త..
# ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్



**హైదరాబాద్:** నగర వాసులకు శుభవార్త. ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ఇంధనం, సమయం ఆదా చేయడానికి నిర్మించిన మరో ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. 1.2 కిలో మీటర్ల మేర ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వరకు నిర్మించిన పీజేఆర్) ఫ్లైఓవర్‌ను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే మాదాపూర్ ప్రాంతం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు ఫైనాన్షియల్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి వెళ్లడానికి మార్గం సుగమమవుతుంది. ట్రాఫిక్ కష్టాలు తొలగడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

**ఫ్లైఓవర్ విశిష్టతలు..**

ఫైనాన్షియల్ డిస్టిక్ట్, మాదాపూర్, శంషాబాద్ వెళ్లేందుకు ట్రాఫిక్ కష్టాలు ఉండవు

శిల్పా లేఔట్ ఫేజ్%-%2 ఫ్లైఓవర్ కాగా.. దీనికి పీజేఆర్ ఫ్లైఓవర్‌గా నామకరణం చేశారు

ప్రాజెక్టు మొత్తం వ్యయం 446.13 కోట్ల అంచనా

ఇందులో ఫేజ్%-%2 ఫ్లైఓవర్ పూర్తి అంచనా వ్యయం రూ.182.72 కోట్లు

ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ రోడ్డు వరకు 630 మీటర్లు

ఆబ్లిగేటరీ స్పామ్ (స్టీల్) 450 మీటర్లు

త్రీ లేన్, వెడల్పు 24 మీటర్లు

క్యారెట్ వే 6 లైన్ల బై డైవర్షనల్

కొండాపూర్ వైపు డౌన్ ర్యాంప్ రెండు వైపులా 165 మీటర్లు

వెడల్పు 12 మీటర్లు

ఆరు లేన్ల ఫ్లైఓవర్‌గా నిర్మాణం

**ఉపయోగాలు ఇలా..**

మోహిదీపట్నం, మాదాపూర్, జూబ్లీహిల్స్ వైపు నుంచి వచ్చే వాహనాలతో గచ్చిబౌలి జంక్షన్ వద్ద భారీ ట్రాఫిక్ జామ్‌కు ఉపశమనం

ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు వాహనాలు అంతరాయం లేకుండా వెళ్లొచ్చు

ఉదయం, సాయంత్రం వేళల్లో హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మధ్య మెరుగైన కనెక్టివిటీ

గచ్చిబౌలి జంక్షన్ వద్ద పీక్ అవర్‌లో దాదాపు 10.5 నిమిషాలు ఆదా ట్రిపుల్ ఐటీ జంక్షన్ నుంచి గచ్చిబౌలి జంక్షన్, సైబరాబాద్ నుంచి గచ్చిబౌలి జంక్షన్‌లకు వేగంగా చేరుకునే వీలు గణనీయమైన ఇంధన ఆదా

# 'పెట్టుబడులు తెచ్చిందేమో జగన్..
# ప్రచారమేమో చంద్రబాబుది

**తాడేపల్లి :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పే పెట్టుబడులన్నీ కట్టుకథలేనని విమర్శించార వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్. ఆయన సీఎం అయిన ప్రతీసారి ఇలాంటి కట్టుకథలే చెప్పుకుంటూ ఉంటారని మండిపడ్డారు. శనివారం, జూన్ 28 తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడిన పోతిన మహేష్.. కోటి ఉద్యోగాలు అంటూ 1999లో చెప్పి కనీసం లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేదనే విషయాన్ని పోతిన మహేష్ గుర్తు చేశారు. ' 2014లో కూడా 25 లక్షల ఉద్యోగాలు, పది లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తానని కథలు వినిపించారు. 2024లో కూడా 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అంటూ మళ్ళీ మోసం చేశారు. ఇలా ప్రతిసారీ దారుణమైన అబద్దాలు చెప్పి జనాన్ని వంచిస్తూనే ఉన్నారు. కోటి యాభై లక్షల మంది నిరుద్యోగులు రాష్ట్రంలో ఉన్నట్టు చంద్రబాబుకు చెందిన ఎల్లోమీడియానే చెప్పింది. మరి ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారు?, ప్రపంచంలో ట్రెండింగులో ఉన్న నాలుగు పదాలను పట్టుకుని అది తానే చేశానంటూ భజన చేయించుకోవటం చంద్రబాబుకు అలవాటు. చంద్రబాబు చెప్పే మాటలు హంబక్కేనని ప్రజలు గుర్తించాలి. జగన్ తెచ్చిన పరిశ్రమలను కూడా తానే తెచ్చినట్టు నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారు. ఎన్టీపీసీ లక్షా పదివేల కోట్ల విలువైన ఎంఓయూని జగన్ ప్రభుత్వంలో చేసుకుంది. అన్ని అనుమతులు, భూకేటాయింపులన్నీ జగనే చేశారు. కానీ చంద్రబాబు చేసినట్టు భజన చేసుకుంటున్నారు ఇలా అనేక ప్రాజెక్టులను జగన్ తెస్తే చంద్రబాబు తన ఖాతాలో వేసుకుంటున్నారు. పెట్టుబడులు తెచ్చేది జగన్, ప్రచారం చేసుకునేది చంద్రబాబు. కూటమి నేతల బెదిరిం



పులు, దాడులకు పారిశ్రామిక వేత్తలు పారిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అసలు ఎవరైనా పెట్టుబడులు పెట్టటానికి వస్తారా?, బాలాజీగోవిందప్ప లాంటి పెద్దపెద్ద పారిశ్రామిక వేత్తలను అరెస్టులు చేసి జైల్లో పెడితే ఇక ఎవరు పెట్టుబడులు పెడతారు?, జిందాల్ కూడా చంద్రబాబు ప్రభుత్వ వేధింపులు తట్టుకోలేక మహారాష్ట్రకు పారిపోయారు. తాడిపత్రిలో ఆదినారాయణరెడ్డి అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీపై దాడి చేయించారు. పల్నాడులో టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సిమెంట్ ఫ్యాక్టరీలపై దాడి చేయించారు. శ్రీకాకుళం, శ్రీకాళహస్తిలలో అక్కడి ఎమ్మెల్యేలు కమిషన్ల కోసం వేధించలేదా?, మైహోం వారి సిమెంట్ ఫ్యాక్టరీపై వేధింపులకు పాల్పడలేదా?, కృష్ణపట్నం పోర్టు నుండి కమీషన్లు ఇవ్వలేదని సోమిరెడ్డి దాడి చేశారు. కమీషన్లు ఇవ్వకపోతే ఎమ్మెల్యేలు సీజ్ ద ఫ్యాక్టరీ అంటున్నారు. ఇలాంటి వారి వలన రాష్ట్రానికి ఎలా పెట్టుబడులు వస్తాయి?, అశోక్ లేలాండ్ 2021లో జగన్ హయాంలోనే ఉత్పత్తి ప్రారంభించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్ లో లిస్టింగ్ కూడా అయింది. కానీ లోకేష్ వెళ్ళి మళ్ళీ ప్రారంభిస్తున్నట్టు బిల్డప్పులు ఇచ్చారు డైకిన్ సంస్థ 2022లో జగన్ హయాంలో ప్రారంభిస్తే దాన్ని కూడా చంద్రబాబు తన ఖాతాలో వేసుకున్నారు. ఎవరి హయాంలో ఎన్నెన్ని పరిశ్రమలు వచ్చాయో చర్చకు సిద్ధమా?, చంద్రబాబు బినామీ కంపెనీలకు వేల కోట్ల విలువైన భూములను కట్టబెడుతున్నారు. ఎకరం 99 పైసలకే ఎవరికోసం ఇస్తున్నారో చంద్రబాబు, లోకేష్ సమాధానం

# కాంగ్రెస్‌లో వర్గపోరు?

-మొదటిపేజీ తరువాయి

పోతారని, తాము ఒరిజినల్ కాంగ్రెస్ నేతలమని, తమకు ప్రాధాన్యత లేకపోతే ఎలాగని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారంలో లేకపోయినా నమ్మి తాము ఇన్నేళ్లు కాంగ్రెస్‌లో ఉంటే ఇప్పుడు తమ భవిష్యత్తును నాశనం చేస్తారా అని పాత నేతలు అంటున్నారు. ఇలా రెండు వర్గాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పట్టు నిలుపుకునేలా, తమను నమ్ముకున్న వారికి పంచాయతీ ఎన్నికల్లో అవకాశాలు కల్పించాలన్న డిమాండ్ ను పార్టీ పెద్దల ఎదుటకు తెస్తున్నారు.తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరిన నియోజకవర్గల్లో ఒరిజినల్ కాంగ్రెస్ వర్సెస్ వలస కాంగ్రెస్ నేతలు అన్న రీతిలో చీలికలు వచ్చాయి. కొత్త నేతల రాకను, పాత నేతలు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్సెస్ ఆపార్టీ సినియర్ నేత జీవన్ రెడ్డి మధ్య తీవ్రమైన విబేధాలు ఉన్నాయి. ఇటీవలే నియోజవర్గంలో వెలసిన ఫ్లెక్సీలలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జీవన్ రెడ్డి ఫోటోలు ప్రముఖంగా పెట్టి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఫోటో పెట్టకపోవడం పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ నియోజకవర్గంలోనే తాము ఒరిజినల్ కాంగ్రెస్ అని బ్యానర్లు జీవన్ రెడ్డి వర్గీయులు ఏర్పాటు చేయడం కూడా జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సంజయ్ వర్గానికి ప్రాధాన్యత ఇస్తే, తాము తిరుగుబాటు చేస్తామని జీవన్ రెడ్డి వర్గీయులు ఇప్పటికే హెచ్చరికలు పంపుతున్నారు. స్టేషన్ ఘన్పూర్ లోను వర్గ విబేధాలు చోటు చేసుకున్నాయి. వరంగల్ జిల్లాలో పట్టును విడవ కూడదని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి హస్తం గూటికి చేరిన కడియం శ్రీహరి తన పట్టును కోల్పోకూడదని భావిస్తున్నారు. ఇలా రెండు వర్గాల మధ్య పోరు నడుస్తోంది. కడియం రాకను కొండా మురళి రాజకీ అవకాశవాదంగా అభివర్ణించారు. ఇక మంత్రి కొండా సురేఖ తాను మంత్రి కావడాన్ని కడియం జీర్ణించుకోలేకపోతున్నారని బహిరంగంగానే వ్యాఖ్యానించడం సంచలం సృష్టించింది. ఇలా రెండు వర్గాలు స్టేషన్ ఘన్పూర్ లో తమ రాజకీయ బలాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పంచాయతీ ఎన్నికల్లో తమ అనుచరులకే అవకాశాలు ఇప్పించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభించారు. రానున్న రోజుల్లో అంతర్గత పోరు ఎక్కడికి దారి తీస్తుందా అన్న ఆందోళనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నారు.బీఆర్ఎస్ నుంచి గెలిచిన బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హస్తం పార్టీలో చేరికతో , జెడ్పీ ఛైర్ పర్సన్ సరిత తిరుపతయ్య మధ్య వర్గ పోరు ప్రారంభమైంది. కొద్ది రోజుల క్రితం మంత్రి పొంగులేటి సమక్షంలోనే ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, సరితకు మద్దతు ఇస్తున్న నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఉద్దేశపూర్వకంగానే అధికార కార్యక్రమాలకు జెడ్పీ ఛైర్మన్ సరితను పిలవడం లేదని మల్లు రవి ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డిని వ్యతిరేకిస్తూ జెడ్పీ ఛైర్మన్ సరిత వర్గం రాజకీయాలు చేస్తోంది. ఇలా రెండు వర్గాలు ఇక్కడ తయారయ్యాయి. పంచాయతీ ఎన్నికల్లో ఎవరి వర్గం వారు వారి అనుచరులకు పంచాయతీ ఎన్నికల్లో అవకాశాల కోసం ప్రయత్నాలు ప్రారంభించారుపఠాన్ చెరు నియోజవర్గం విషయానికి వస్తే ఇక్కడ మూడు వర్గాల మధ్య విబేధాలున్నాయి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నీలం మధు,కఠారి శ్రీనివాస్ గౌడ్ మధ్య మొదటి నుంచి విబేధాలున్నాయి. పార్టీ అవకాశాల కోసం ఇద్దరు ప్రయత్నిస్తున్నవారే. ఇలాంటి సందర్భంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ లో చేరడంతో పఠాన్ చెరులో ఇప్పుడు మూడు వర్గాలయ్యాయి. అయితే నీలం మధు, కఠారి శ్రీనివాస్ గౌడ్ మహిపాల్ రెడ్డి తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇక కఠారి అనుచరులు అయితే ఒక అడుగు ముందుకేసి మహిపాల్ రెడ్డి కార్యాలయంపై దాడి చేశారు. అక్కడి ఫర్నీచర్, కుర్చీలను ధ్వంసం చేశారు. ఈ మూడు వర్గాలు నియోజకవర్గంలో తమ పట్టుకోసం ప్రయత్నిస్తున్నాయి. తమ అనుచరులకే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇప్పించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ మూడు వర్గాలను సయోధ్య కుదర్చడం అంత సులువేమి కాదని తెలుస్తోంది. ఒక వేళ ఇదే పరిస్థితి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఇబ్బందులు ఎదుర్కోవడం ఖాయం.భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆయన వర్గం తెల్లం వెంకట్రావుకు వ్యతిరేక వర్గంగా ఏర్పడింది. ఇరు నేతలు నియోజకవర్గ పట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ఇరు వర్గాల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణలు చోటు చేసుకోనప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ వర్గం వారికి న్యాయం చేయాలని పార్టీ పెద్దలను డిమాండ్ చేస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ కాంగ్రెస్ లో అంతకు ముందు బీజేపీ నుంచి చేరిన ఎనుగు రవీందర్ రెడ్డి మధ్య వర్గపోరు నడుస్తోంది. పోచారం ఎమ్మెల్యేగా ఉండగా, ఎనుగు రవీందర్ రెడ్డి నియోజకవర్గ ఇన్ చార్జిగా ఉన్నారు. పోచారం చేరిక సమయంలోనే ఎనుగు రవీందర్ రెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. ఆ తర్వాత కూడా ఆయన పోచారం పై పలు అవినీతి ఆరోపణలు బహిరంగంగానే చేయడం జరిగింది. ఇలా రెండు వర్గాలు ఈ స్థానిస సంస్థల ఎన్నికల్లో తమ అనుచరులకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. చెవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కాలే యాదయ్య కాంగ్రెస్ లో చేరడంతో అక్కడ పాత నేతలతో వర్గ పోరు మొదలైంది. అక్కడ బలమైన కాంగ్రెస్ నేతగా ఉన్న భీం భరత్ వర్గం కాలే యాదయ్య తీరును వ్యతిరేకిస్తోంది. కాలే యాదయ్య ను పార్టీలోకి తీసుకోవడం వల్ల పాత నేతలకు అన్యాయం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. పాత నేతలను పక్కన పెట్టి తమ అనుచరలకే కాలే యాదయ్య ప్రాధాన్యత ఇస్తున్నారని భీం భరత్ వర్గం ఆరోపిస్తుంది. వలస వచ్చిన నేతలకు కాకుండా, పార్టీని నమ్ముకున్న విధేయులకు స్థానిక సంస్థల్లో టికెట్ ఇవ్వాలని భరత్ వర్గం డిమాండ్ చేస్తుంటే, పార్టీని నమ్ముకుని వచ్చిన తమకు అన్యాయం చేయడం సరైంది కాదని ఎమ్మెల్యే వర్గం వాధిస్తోంది.ఇలా తెలంగాణ కాంగ్రెస్ లో బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో అంతర్గత పోరు నడుస్తోంది. ఇలా వర్గాల మధ్య సయోధ్య కుదర్చడం, రెండు వర్గాలకు న్యాయం జరిగేలా స్థానిక సంస్థల్లో వారు సూచించిన వారికి అవకాశాలు ఇవ్వడం కత్తిమీద సామే. ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినా మరో వర్గం నుంచి సహాయ నిరాకరణ తప్పదు. ఇది స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను దెబ్బతీసే అవకాశం ఉంది. ఎన్నికల నాటికి ఈ పరిస్థితులను ఎలా మార్చుతారన్నది అటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కు, సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ లాంటిదేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆగస్ట్ 15వ తేదీ నుంచే
# మహిళలకు ఉచిత బస్సు



-మొదటిపేజీ తరువాయి

ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ, ఏసీ బస్సులే ఉండాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.


**పురపాలక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం**

అలాగే.. మున్సిపల్, పురపాలక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉండవల్లి నివాసంలో సమీక్షకు మంత్రి నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అమృత్ స్కీమ్ కింద తాగునీరు పైప్‌లైన్ పనులకు టెండర్లు పిలిచామని సీఎం చంద్రబాబు తెలిపారు. వారంలో రూ.5,350 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలుస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు, విశాఖపట్నంలో చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నెల్లూరు, రాజమండ్రి ప్లాంట్లకు టెండర్లు పూర్తి అయ్యాయని చెప్పారు. కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్లాంట్లకు త్వరలో టెండర్లు పిలుస్తామని అన్నారు. మున్సిపాలిటీల్లో ఆధునిక యంత్రాల కొనుగోలుకు రూ.225 కోట్లు కేటాయించామని తెలిపారు. వీలైనంత త్వరగా లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## 'మిస్టర్ రేవంత్..
## మీ తెలివి తక్కువ నిర్ణయాలను మేం రద్దు చేస్తాం'

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరోసారి ధ్వజమెత్తారు. ప్రధానంగా అన్నపూర్ణ క్యాంటీన్‌ల పేర్లు మార్చడంపై ప్రభుత్వంపై మండిపడ్డారు కేటీఆర్. ఢిల్లీ బాస్‌లకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు విధేయతను చూపించాలనుకుంటే.. మీ పేర్లను రాజీవ్ లేదా జవహర్‌గా మార్చుకోండి అంటూ చురకలంటిచారు. ఈ మేరకు తన సోషల్ మీడియా అకౌంట్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ' అన్నపూర్ణ క్యాంటీన్‌ల పేరు మార్చడం హాస్యాస్పదం.. సిగ్గుచేటు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మీ తెలివి తక్కువ నిర్ణయాలను రద్ద చేస్తాం. 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మీ నిర్ణయాలకు చరమగీతం పాడతాం' అని కేటీఆర్ హెచ్చరించారు.

## హలో నిరుద్యోగి.. ఛలో సెక్రటేరియట్!



**హైదరాబాద్:** 'హలో నిరుద్యోగి.. ఛలో సెక్రటేరియల్ పోస్టర్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు రిలీజ్ చేశారు. శనివారం, జూన్ 28) తెలంగాణ భవన్‌లో నిరుద్యోగులతో కలిసి హలో నిరుద్యోగి.. ఛలో సెక్రటేరియల్ పోస్టర్‌ను హరీష్ రావు విడుదల చేశారు. దీనిలో భాగంగా హరీష్ రావు మాట్లాడుతూ.. ' ఉస్మానియా యూనివర్శిటీ, అశోక్ నగర్ నుంచి పెద్ద ఎత్తును నిరుద్యోగులు తెలంగాణ భవన్‌కు వచ్చారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని జూలై 4వ తేదీన ఛలో సచివాలయానికి పిలుపునిచ్చారు. నిరుద్యోగుల ఛలో సచివాలయం కార్యక్రమంకు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుంది.నిరుద్యోగుల ఛలో సచివాలయంకు పార్టీ మద్దతు ఇచ్చినట్లు నిరుద్యోగులు చెప్పారు. బీఆర్ఎస్ హయంలో 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే దక్కేలా కేసీఆర్ చొరవ తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న జాబ్ క్యాలెండర్ లో ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయడం లేదని నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారు. ఇది జాబ్ క్యాలెండర్ కాదు జాబ్ లెస్ క్యాలెండర్ ఇది దగా క్యాలెండర్. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్న జాబ్ క్యాలెండర్ అమలు కావడం లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల సమయంలో ఏడాదికి లక్ష ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 12 వేల ఉద్యోగాలకు మించి ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో ఇందిరమ్మ నమరాలుగా మాట ఇస్తున్న అని ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ ఇచ్చారు.యూత్ డిక్లరేషన్ లో 5 అంశాల చెప్పిన ప్రియాంక గాంధీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. స్కూటీ అంటే నాకు ఇష్టమని చెప్పిన ప్రియాంక గాంధీ, మహిళ స్టూడెంట్స్ కి ఇస్తామన్న స్కూటీ ఏమైందో సమాధానం చెప్పాలి. నిరుద్యోగ భృతి ఇస్తామన్న చెప్పిన ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్న నిరుద్యోగ భృతి అతి గతి లేదు. యూత్ డిక్లరేషన్ లో 5 హామీలు ఇచ్చిన ప్రియాంక గాంధీ, అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. యూత్ డిక్లరేషన్ నెరవేర్చనందుకు రేవంత్ రెడ్డి పైన ఎందుకు మొట్టి కాయలు వెయ్యడం లేదు. ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చిన గాంధీ కుటుంబం నిరుద్యోగ యువతి యువకులకు హామీలు ఇచ్చి దారుణంగా మోసం చేశారు. నిరుద్యోగుల పక్షాన మాట్లాడిన ప్రొఫెసర్ కోదండరాం, ఆకూనూరి మురళీ, రియాజ్, ఆఖరికి ప్రియాంక గాంధీకి ఉద్యోగం వచ్చింది. తెలంగాణ రక్తంలోనే ప్రశ్నించే తత్వం ఉంటుంది. నిరుద్యుగులరా మీరు పోరాడుతూనే ఉండండి. మీ న్యాయ బద్ధమైన పోరాటానికి సంపూర్ణ మద్దతు బిఆర్ఎస్ ఇస్తుంది. రేపటి తరమైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలి' అని డిమాండ్ చేశారు.

## పాలసముద్రం తాళ్లూరి శివాను అభినందించిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్


ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 28:



గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మదిన సందర్భంగా గంగాధర్ నెల్లూరు మండలం రామానాయుడు పల్లి వద్ద ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మదినకి పాలస ముద్రం టిడిపి యువనాయకుడు తాళ్లూరిశివ ఆధ్వర్యంలో భారీ కటౌట్ బ్యానర్లు బెలూన్లు క్రేన్‌తో గజమాల ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మ దినని అంగరంగ వైభవంగా నిర్వహించి నందుకు తాళ్లూరు శివను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అభినందించి కృతజ్ఞతలు తెలియజేశా రు.. అలాగే పాలసముద్రం మండలం నుంచి సుమారు 1500 మందిని బస్సులతో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మదిననికి తీసుకువచ్చానని తాళ్లూరి శివ తెలిపారు. అలాగే చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ వసంత కుమార్ అందరినీ ఘనంగా తాళ్లూరి శివ ఘనంగా సాలువ తో సత్కరించారు.

## భెల్‌కు అదానీ పవర్ భారీ ఆర్డర్

ప్రభుత్వ రంగంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)కు అదానీ పవర్ లిమిటెడ్ నుంచి భారీ ఆర్డర్ దక్కింది. రూ.6,500 కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందింది. అదానీ పవర్‌కు చెందిన రారుపూర్, మిర్జాపూర్‌లోని థర్మల్ పవర్ ప్లాంట్‌ల కోసం 800 మెగావాట్ సామర్థ్యం గల రెండు సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ యూనిట్‌లను భెల్ తయారు, సరఫరా, నిర్మాణం చేసి ఇవ్వనుంది. ఈ ప్రాజెక్టులు అదానీ పవర్ శక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచడంతో పాటు, దేశంలో విద్యుత్ డిమాండ్‌ను తీర్చనుందని ఆ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఈ ఆర్డర్ ఒప్పందంలో బాయిలర్లు, టర్బైన్లు, జనరేటర్లు, సంబంధిత ఇతర పరికరాల సరఫరాతో పాటు, వాటి స్థాపన, నిర్వహణ సేవలు కూడా ఉన్నాయి. ఈ ఒప్పందం భెల్‌కు ఆర్థికంగా బలమైన అవకాశంగా మారనుంది. ఇది కంపెనీ ఆదాయాన్ని పెంచడంతో పాటు తన మార్కెట్ స్థానాన్ని బలోపేతం చేస్తుంది. అదానీ పవర్‌తో ఈ భాగస్వామ్యం భెల్ సాంకేతిక నైపుణ్యం, నమ్మకమైన సేవలను మరోసారి రుజువు చేస్తుందని ఆ కంపెనీ అధికారులు పేర్కొన్నారు. ఈ ఆర్డర్ దేశీయ విద్యుత్ రంగంలో స్వదేశీ తయారీని ప్రోత్సహించే లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇంధన భద్రతను మెరుగుపరచడంతో పాటు, స్థానిక ఉపాధి అవకాశాలను కూడా సృష్టించే అవకాశం ఉందన్నారు.




# అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ బ్రాండ్‌గా అదానీ గ్రూప్

ఈ సంవత్సరం అదానీ బ్రాండ్ విలువ పెరుగుదల 2023లో నివేదించబడిన మొత్తం బ్రాండ్ వాల్యుయేషన్ కంటే ఎక్కువగా ఉంది. దీని వలన అదానీ గ్రూప్ గత సంవత్సరం 16వ స్థానం నుండి 13వ స్థానానికి చేరుకుంది. అదానీ భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్రాండ్‌గా అవతరించింది. దీని బ్రాండ్ విలువ 82 శాతం పెరిగింది. లండన్‌కు చెందిన బ్రాండ్ ఫైనాన్స్ మోస్ట్ వాల్యుయబుల్ ఇండియన్ బ్రాండ్స్ 2025 నివేదిక ప్రకారం, గ్రూప్ వృద్ధికి దాని దూకుడు, సమగ్ర మౌలిక సదుపాయాల దృష్టి, గ్రీన్ ఎనర్జీ ఆశయాలలో పెరుగుదల, కీలకమైన వాటాదారులలో బ్రాండ్ ఈక్విటీ పెరుగుదల కారణమని పేర్కొంది. అదానీ బ్రాండ్ విలువ 2024లో వి3.55 బిలియన్ల నుండి వి6.46 బిలియన్లకు పెరిగింది. ఇది వి 2.91 బిలియన్ల పెరుగుదలను సూచిస్తుంది. ఈ వృద్ధి సమూహం వ్యూహాత్మక స్పష్టత, బలం, స్థిరత్వం పట్ల నిబద్ధతకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. నివేదిక ప్రకారం, ఈ సంవత్సరం అదానీ బ్రాండ్ విలువ పెరుగుదల 2023లో నివేదించబడిన మొత్తం బ్రాండ్ వాల్యుయేషన్ కంటే ఎక్కువగా ఉంది. దీని వలన అదానీ గ్రూప్ గత సంవత్సరం 16వ స్థానం నుండి 13వ స్థానానికి చేరుకుంది. ఆ కంపెనీ రికార్డు స్థాయిలో ఆదాయాలు, అపారమైన వృద్ధి, చారిత్రాత్మక లాభాలను సాధించింది. టాటా గ్రూప్ మరోసారి భారతదేశ బ్రాండింగ్ ప్రపంచంలో ఆధిపత్యం చెలాయించింది. బ్రాండ్ వాల్యుయేషన్ కన్సల్టెన్సీ బ్రాండ్ ఫైనాన్స్ తాజా ఇండియా 100 నివేదిక 2025 ప్రకారం, టాటా గ్రూప్ భారతదేశంలో అత్యంత విలువైన బ్రాండ్‌గా అవతరించింది. ఈ సంవత్సరం దాని బ్రాండ్ విలువ 10% పెరిగింది. అలాగే దేశంలో వి30 బిలియన్ల మార్కును దాటిన మొదటి బ్రాండ్‌గా నిలిచింది. దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటం, 6-7% జీడీపీ వృద్ధి రేటు అంచనా కారణంగా భారతీయ కంపెనీలు తమ బ్రాండ్ విలువను పెంచుకోవడానికి అద్భుతమైన అవకాశాన్ని పొందవచ్చని ఈ నివేదిక పేర్కొంది. పెరుగుతున్న దేశీయ డిమాండ్, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం, మూలధన పెట్టుబడుల సహాయంతో, ప్రపంచ అనిశ్చితులు ఉన్నప్పటికీ కంపెనీలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. లార్సెన్ అండ్ టూబ్రో గ్రూప్ (బ్రాండ్ విలువ 3 శాతం పెరిగి 7.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది) హైటెక్ తయారీపై పెరిగిన ప్రాధాన్యతతో పాటు పునరుత్పాదక, సెమీకండక్టర్లలోకి వై తొమ్మిదవ అత్యంత విలువైన భారతీయ బ్రాండ్‌గా నిలిచింది. 10వ స్థానంలో మహీంద్రా గ్రూప్ (బ్రాండ్ విలువ 9 శాతం పెరిగి 7.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది) టెక్, ఇంజనీరింగ్ ఆవిష్కరణలతో బలమైన ఊపును కొనసాగించింది. ఇంతలో తాజ్ హోటల్స్ భారతదేశంలో బలమైన బ్రాండ్‌గా అవతరించింది. ఈ సంవత్సరం ఆసియన్ పెయింట్స్ కూడా తన బ్రాండ్‌ను కొనసాగించింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన పెయింట్స్, బ్రాండ్‌గా తన హోదాను నిలుపుకుంది. అమూల్ కూడా తన బ్రాండ్‌ను కొనసాగించినట్లు నివేదిక పేర్కొంది.




# ఈక్విటీ స్కీమ్స్‌లో ఆ రెండే టాప్.. మూడు నెలలుగా రాబడి వరద

భారతదేశంలో పెట్టుబడిదారుల ఆలోచనలు మారుతున్నాయి. ముఖ్యంగా పెరిగిన ఆర్థిక అక్షరాస్యత నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడికి ఆసక్తి చూపుతున్నారు. తమ పెట్టుబడిని రిస్క్ చేసి మరీ మంచి లాభాలు రావాలని కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఫ్లెక్సీ-క్యాప్, మల్టీ-క్యాప్ ఫండ్స్ అనేవి రెండు ప్రసిద్ధ ఈక్విటీ ఆధారిత పథకాలు పెట్టుబడిదారులకు మంచి లాభాలు ఇచ్చారు. ఈ రెండూ ఏఎంఎఫ్ఐ విడుదల చేసిన డేటా ప్రకారం గత మూడు నెలల్లో గణనీయమైన నికర రాబడిని సాధించాయి. ఏఎంఎఫ్ఐ మే 2025 డేటా ప్రకారం మల్టీ-క్యాప్ ఫండ్స్ నికర ఇన్‌ఫ్లో రూ. 2,999.29 కోట్లుగా ఉండగా, ఫ్లెక్సీ-క్యాప్ ఫండ్స్ రూ. 3,841.32 కోట్లుగా వచ్చాయి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు భారతీయ పెట్టుబడిదారులలో ఆదరణ పొందుతూనే ఉన్నందున, ఫ్లెక్సీ-క్యాప్, మల్టీ-క్యాప్ ఫండ్ల మధ్య వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం అనేది పెట్టుబడి నిర్ణయాలకు చాలా ముఖ్యం. మల్టీ-క్యాప్ ఫండ్లు సెబీ నిర్దేశించిన నిర్మాణాన్ని అనుసరిస్తాయి. అంటే లార్జ్, మిడ్, స్మాల్-క్యాప్ స్టాక్‌లకు కనీసం 25 శాతం కేటాయింపుతో పొదుపు చేస్తాయి. ఈ నియమం కంపెనీ పరిమాణాలలో క్రమశిక్షణ కలిగిన వైవిధ్యతను నిర్ధారిస్తుంది. మార్కెట్ సర్కిల్స్‌లో పనితీరును సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. అయితే ఈ నిర్మాణం మార్కెట్ మార్పులకు ప్రతిస్పందించడంలో ఫండ్ మేనేజర్‌కు ప్రాముఖ్యతను కూడా పరిమితం చేస్తుంది. ఇది అస్థిర దశలలో రిస్క్-రివార్డ్ తీవ్రతను పెంచుతుంది. 65 శాతం ఆస్తులు ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టబడినంత వరకు ఫ్లెక్సీ-క్యాప్ ఫండ్లు పూర్తి సౌలభ్యాన్ని అందిస్తాయి. ఫండ్ మేనేజర్లు మార్కెట్ పరిస్థితుల ఆధారంగా కేటాయింపులను సర్దుబాటు చేయవచ్చు . తిరోగమనాల సమయంలో లార్జ్-క్యాప్‌లపై పూర్తిగా దృష్టి పెట్టడం లేదా ర్యాలీల సమయంలో మిడ్-స్మాల్-క్యాప్‌లపై దృష్టి పెట్టాలని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్ క్యాప్స్ కంటే రంగాలు తరచుగా ముఖ్యమైనవిగా ఉంటాయి. ముఖ్యంగా స్వల్ప నుంచి మధ్యకాలిక వ్యాపారులకు నగదు అనేది చాలా కీలకంగా ఉంటుంది. అయితే రాబడికి సమయంతో పాటు కేటాయింపుకు సంబంధించిన ప్రాముఖ్యత ఉంటుంది. నియమాల ఆధారిత విధానంతో స్థిరమైన, సమతుల్య వైవిధ్యాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు మల్టీ-క్యాప్ ఫండ్లు అనువైనవని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్ ట్రెండ్‌ల ఆధారంగా డైనమిక్ కేటాయింపును కోరుకునే వారికి ఫ్లెక్సీ-క్యాప్ ఫండ్లు మరింత అనుకూలంగా ఉంటాయని వివరిస్తున్నారు.



## స్పోర్ట్స్

# గంభీర్‌కు అన్నీ ఇచ్చారు.. అతనిప్పుడు విజయాలు ఇవ్వాలి!

మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. గంభీర్ నాయకత్వంలో జట్టు బలపడుతుందని భావించినప్పటికీ, ఇంగ్లాండ్‌తో టెస్ట్ ఓటమి ఆ సందేహాలను రేకెత్తించిందని అన్నారు. ఈ ఓటమి గంభీర్‌పై ఒత్తిడిని పెంచుతుందని చోప్రా అభిప్రాయపడ్డారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ, గంభీర్ కోచ్‌గా వచ్చిన తర్వాత టీమిండియా శక్తివంతం అవుతుందని ఆశించారని, వైట్-బాల్ క్రికెట్‌లో మంచి ఫలితాలు వచ్చినప్పటికీ, టెస్ట్ క్రికెట్‌లో జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిందని చోప్రా తెలిపారు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో ఓటముల తర్వాత, శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో హెడింగ్లీలో ఇంగ్లాండ్‌తో ఐదు వికెట్ల తేడాతో ఓడిపోవడంతో సిరీస్ దారుణంగా ప్రారంభమైంది. గంభీర్ తన వ్యూహాలతో ఫలితాలు సాధించాలని, లేకపోతే ఒత్తిడి పెరుగుతుందని చోప్రా హెచ్చరించారు. ఆస్ట్రేలియా సిరీస్ ఓటమి తర్వాత విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సీనియర్లు టెస్ట్ కెరీర్‌ను ముగించారు. గిల్ నేతృత్వంలో కొత్త జట్టు ఇంగ్లాండ్ పర్యటనలో చెడు అనుభవంతో మొదలైంది. గిల్ కొత్తగా కెప్టెన్ అయినందున అతన్ని నిందించలేమని, కానీ గంభీర్‌పై ప్రశ్నలు తప్పవని చోప్రా అన్నారు. “భారత క్రికెట్ బాగుంటే అందరూ గర్విస్తారు, చెడితే విమర్శలు తప్పవు. గిల్ కొత్త కెప్టెన్ కాబట్టి అతనిపై ఓపికగా ఉంటాను, కానీ గంభీర్‌పై ప్రశ్నలు ఉంటాయి” అని చోప్రా పేర్కొన్నారు. గౌతమ్ గంభీర్ భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్న సమయంలో, భారత జట్టు చివరి తొమ్మిది టెస్ట్ మ్యాచ్‌లలో కేవలం బంగ్లాదేశ్‌తో జరిగిన ఒక టెస్ట్ సిరీస్‌ను మాత్రమే గెలిచింది. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో 3-0 తేడాతో వైట్‌వాష్ అయింది, ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 3-1 తేడాతో కోల్పోయిందన్నారు. గంభీర్‌పై భారీ ఒత్తిడి ఉందని, టెస్ట్ క్రికెట్‌లో అతని పనితీరు సరిగా లేదని అన్నారు. “గౌతమ్ గంభీర్‌పై చాలా ఒత్తిడి ఉంది. టెస్ట్ క్రికెట్‌లో అతని రికార్డును చూస్తే, అతను ఎక్కువ మ్యాచ్‌లు గెలవలేదు. బంగ్లాదేశ్‌పై రెండు మ్యాచ్‌లు, ఆస్ట్రేలియాపై ఒక మ్యాచ్ మాత్రమే గెలిచాడని తెలిపాడు. కానీ న్యూజిలాండ్‌తో మూడు, ఆస్ట్రేలియాతో మూడు, ఇంగ్లాండ్‌తో ఒక మ్యాచ్‌లను తాము కోల్పోయామని తెలిపాడు. గంభీర్‌కు బీసీసీఐ నుండి అడిగిన ప్రతి విషయం అందించబడిందని, కాబట్టి సాకులు చెప్పేందుకు అతనికి ఎటువంటి అవకాశం లేదన్నారు. ఫలితాలు అందించాల్సిన సమయం ఆసన్నమైందని చోప్రా అన్నారు. “వైట్-బాల్ క్రికెట్‌లో అతని పనితీరు బాగుంది. జట్టు బాగా ఆడుతోంది. కానీ టెస్ట్ క్రికెట్‌లో జట్టు ప్రదర్శనపై చాలా ప్రశ్నలు ఉన్నాయన్నారు. ఇంగ్లాండ్ సిరీస్‌పై చాలా ఒత్తిడి ఉందని. ఒకవేళ ఈ సిరీస్ బాగా జరగకపోతే, ప్రశ్నలు తలెత్తుతాయని పేర్కొన్నారు. భారత క్రికెట్ బాగా ఆడాలని కోరుకుంటున్నాను,” అని చోప్రా అన్నారు.



## ఆ విండీస్ స్టార్ క్రికెటర్‌పై సంచలన ఆరోపణలు



వెస్టిండీస్ క్రికెట్ జట్టులో ఒక వార్త పెను తుఫాను సృష్టించింది. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఆడుతున్న కరేబియన్ క్రికెట్ జట్టు ఆటగాడిపై సంచలన ఆరోపణలు వెల్లువెత్తాయి. ఓ మైనర్ తో సహా 11 మంది మహిళలపై అత్యాచారానికి ఒడిగట్టాడంటూ ఓ విండీస్ స్టార్ క్రికెటర్ పై కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతం వెస్టిండీస్, ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరుగుతోంది. అయితే ఈ సిరీస్ మధ్యలోనే వెస్టిండీస్ క్రికెట్‌లో ఒక వార్త తుఫాన్ సృష్టించింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌లో బిజీగా ఉన్న వెస్టిండీస్ క్రికెట్ జట్టుకు చెందిన ఒక ఆటగాడిపై అత్యాచారం ఆరోపణలు కలకం రేపుతున్నాయి. కరేబియన్ మీడియాలో వచ్చిన నివేదికల ప్రకారం, 11 మంది మహిళలు వెస్టిండీస్ క్రికెటర్‌పై అత్యాచారం ఆరోపణలు చేశారు. వారిలో ఒకరు మైనర్ బాలిక అని సమాచారం. అయితే ఈ ఆరోపణల తర్వాత , వెస్టిండీస్ క్రికెట్ బోర్డు ఆ ఆటగాడిని రక్షించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందని కూడా వార్తలు వస్తున్నాయి. కరేబియన్ దేశమైన గయానాలోని ‘కిటెర్’ వార్తా వెబ్‌సైట్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో ఈ ఆరోపణలు వచ్చాయి. దీని ప్రకారం 11 మంది మహిళలు గయానీస్ క్రికెటర్‌పై అత్యాచారం, లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. ఆ ఆటగాడు ప్రస్తుతం వెస్టిండీస్ క్రికెట్ సిరీస్ లో కూడా ఉన్నాడని ఈ నివేదిక పేర్కొంది. ఇది మాత్రమే కాదు, వెస్టిండీస్ బోర్డు ఈ ఆటగాడి గుర్తింపును వెల్లడించకుండా కేసును కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో, కరేబియన్ ఛానల్ ‘స్పోర్ట్స్ మాక్స్ టీవీ’ వెస్టిండీస్ క్రికెట్ బోర్డు చైర్మన్ కిషోర్ షిలోహ్ చెప్పినట్లు ఉటంకిస్తూ, ‘ఆయనకు ఈ సంఘటనలు, ఆరోపణల చుట్టూ ఉన్న పరిస్థితుల గురించి తెలియదు. బోర్డు ఈ విషయంపై వ్యాఖ్యానించదు’ అని పేర్కొంది. ఈ ఆరోపణలతో పాటు, ఇదే కేసులో గత రెండు సంవత్సరాలుగా ఒక బాధితురాలు న్యాయం కోరుతున్నట్లు కూడా వెలుగులోకి వచ్చింది. స్పోర్ట్స్ మాక్స్ టీవీ నివేదికలో, న్యాయవాది నిగెల్ హ్యూ మాట్లాడుతూ, రెండేళ్ల క్రితం ఒక మహిళ ఈ విషయం గురించి తనను సంప్రదించిందని పేర్కొన్నారు. నిందితుడైన క్రికెటర్ గత సంవత్సరం (2024) ఆస్ట్రేలియాలో పర్యటించిన వెస్టిండీస్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. గబ్బాలో జట్టు చారిత్రాత్మక టెస్ట్ విజయంలో కూడా భాగమయ్యాడని సదరు న్యాయవాది తెలిపారు.

## ఇంగ్లాండ్‌తో రెండో టెస్ట్.. బుమ్రాతో పాటు మరో ప్లేయర్ కూడా ఔట్!




భారత్ ఇంగ్లాండ్ రెండవ టెస్టు మ్యాచ్‌లో జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ ఆడకపోవచ్చని వార్తలు వస్తున్నాయి. బుమ్రా లేకపోతే, మహ్మద్ సిరాజ్ బౌలింగ్ ఎటాక్ ను నడిపించవచ్చు. అర్షదీప్ సింగ్ లేదా ఆకాశ్ దీప్ వారి స్థానంలో ఆడే అవకాశం ఉంది. భారత్, ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్ట్ కోసం ఇరుదేశాల క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జూలై 2 నుంచి రెండో టెస్ట్ షురూ కానుంది. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా.. ఇప్పటికే తొలి టెస్ట్ విజయంతో ఇంగ్లాండ్ జట్టు 0-1 ఆధిక్యంలో ఉంది. దీంతో ఎలాగైనా రెండో టెస్ట్ గెలిచి.. సిరీస్‌ను 1-1తో సమం చేసి.. మూడో టెస్ట్‌కు సిద్ధం అవ్వాలని యంగ్ టీమిండియా భావిస్తోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి సీనియర్ల రిటైర్మెంట్ తర్వాత టీమిండియా ఆడుతున్న సిరీస్ కావడంతో అందరి ఫోకస్ ఈ సిరీస్‌పై ఉంది. కాగా, ఎంతో కీలకమైన రెండో టెస్టుకు టీమిండియా ప్రధాన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా దూరం అయినట్లు వార్తలు వస్తున్నాయి. బుమ్రాతో పాటు మరో ప్లేయర్ కూడా రెండో టెస్ట్ ఆడకపోవచ్చని తాజా సమాచారం. ఆ ప్లేయర్ ఎవరంటే.. ప్రసిధ్ కృష్ణ. ఈ యంగ్ పేసర్ కూడా రెండో టెస్ట్‌కు దూరం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. తొలి టెస్టులో ఐదు వికెట్లు సాధించిన ప్రసిద్.. పరుగులు భారీగా సమర్పించుకున్నాడు. అతని ఎకానమీ 6 కంటే ఎక్కువగా ఉంది. అందుకే.. అతన్ని పక్కనపెట్టి అతని స్థానంలో అర్షదీప్ సింగ్ లేదా ఆకాశ్ దీప్‌ను రెండో టెస్ట్ కోసం ప్లేయింగ్ ఎలెవెన్‌లోకి తీసుకునే అవకాశం ఉంది. బుమ్రాతో పాటు ప్రసిద్ కూడా ఆడకుంటే.. అర్షదీప్, ఆకాశ్ దీప్ ఇద్దరూ రెండో టెస్ట్ బరిలోకి దిగే ఛాన్స్. ఇక రెండో టెస్ట్ కోసం టీమిండియా నిర్వహిస్తున్న ప్రాక్టీస్ సెషన్స్ బుమ్రాతో పాటు ప్రసిద్ సైతం హాజరు కాలేదు. దీంతో అతను రెండో టెస్ట్ ఆడటం లేదనే విషయం కన్ఫామ్ చేసుకోవచ్చని క్రికెట్ నిపుణులు అంటున్నారు. బుమ్రా లేకపోతే.. టీమిండియా బౌలింగ్ ఎటాక్‌కు మొహమ్మద్ సిరాజ్ నాయకత్వం వహించనున్నారు. కానీ, తొలి టెస్ట్‌లో సిరాజ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. కానీ, అతని ఎకానమీ బాగుంది. అయితే సిరాజ్ ఒక్కసారి వికెట్లు తీయడం మొదలుపెడితే, పిచ్ అతనికి అనుకూలంగా ఉంటే.. అతన్ని ఆపడం ఇంగ్లాండ్ వల్ల కాదు. మ్యాచ్‌ను వన్‌సైడ్ చేసే బౌలర్ సిరాజ్.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143